WILL of GOD
316

## దేవుని చిత్తమును నేను ఏవిధంగా తెలుసుకొంటాను?

*“మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి.”* రోమా 12:2

దేవుని చిత్తాన్ని తెలుసుకోవడం, దానిని చేయడం చాలా ప్రాముఖ్యం. ప్రభువైన యేసు వలే ఉండండి. ఆయన ఇలా చెప్పాడు, *“నా యిష్టమును నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకమునుండి దిగి వచ్చితిని.”* యోహాను 6:38. దేవుని చిత్తంలో అధిక భాగం విశ్వాసులందరికీ ఒకే విధంగా అన్వయిస్తుంది. అయితే విశ్వాసుల విషయంలో వ్యక్తిగతీకరించబడిన చిత్తాన్ని దేవుడు కలిగియున్నాడు. నీవు ఆయనతో దైనందిన నమ్మకత్వంలో నీ నడకలో ఎదుగుతున్న కొలదీ ఆయన దానిని క్రమంగా బయలుపరుస్తాడు. నీవు దేవుని చిత్తాన్ని తెలుసుకొంటావు. ఆయన నీకు అవగాహనను అనుగ్రహిస్తాడు. *“నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవా యందు నమ్మకముంచుము. నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము. అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును.”* సామెతలు 3:5-6. విశ్వాసులందరి కోసం దేవుని సాధారణ చిత్తమును నీవు బైబిలు నుండి యెరుగుదువు. ఆయన వాక్యానికీ, నమ్మదగిన విధేయతతో కూడిన జీవితానికీ మధ్య పరస్పర విరుద్ధం కాని కలయికగా ఉండే వ్యక్తిగతీకరించబడిన ఆయన చిత్తాన్ని నీవు యెరుగుదువు. ఆ విధేయత పునాది నుండి, నీ కోసం ఆయన చిత్తాన్ని నీవు నిర్ధారించుకొంటావు, దానికి విధేయత చూపుతావు. తండ్రిని ప్రార్థించు. ఆయన వాక్యం, ఆయన జ్ఞానం, ఆయన మనుష్యులు, ఆయన సమాధానం నుండి మార్గదర్శకత్వం పొందు. నీవు దేవుని చిత్తాన్ని తెలుసుకున్నప్పుడు, ఆయనకు విధేయత చూపు.

**దేవుని సాధారణ చిత్తం.** దేవుని సాధారణ చిత్తంలో అధిక భాగం బైబిలు ఆజ్ఞలు, సూత్రములు, ఉదాహరణలలో కనిపిస్తుంది. నీ జీవితం పట్ల దేవుని చిత్తాన్ని తెలుసుకోవడానికి బైబిలు ప్రాథమిక ఆధారం. *“నీ వాక్యము నా పాదములకు దీపమును. నా త్రోవకు వెలుగునై యున్నది.”* కీర్తన 119:105.

1. ఆజ్ఞలు. విశ్వాసులందరి కోసం బైబిలులో అనేక ఆజ్ఞలు ఉన్నాయి, అవి ఏమనగా, *“ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసు క్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము.”* 1 థెస్సలొనీకయులు 5:16-18. *“మీరు పరిశుద్ధులగుటయే, అనగా మీరు జారత్వమునకు దూరముగా ఉండుటయే దేవుని చిత్తము.”* 1 థెస్సలొనీకయులు 4:3. ప్రభువైన యేసు చెప్పాడు, *“మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు.”* యోహాను 14:15. ఆజ్ఞలను వాటి సందర్భాన్ని అర్థం చేసుకొనుము. ఓడను కట్టమని దేవుడు నోవహుకు చెప్పాడు, ఆదికాండము 6:14. అలా చేయమని దేవుడు నీకు చెప్పలేదు. హెబ్రోనుకు వెళ్ళమని దేవుడు దావీదుకు చెప్పాడు, 2 సమూయేలు 2:1. అలా చేయమని దేవుడు నీకు చెప్పలేదు. ఒక ఆజ్ఞను దాని సందర్భంలో నుండి వేరు చేసి దానిని అర్థం చేసుకోకూడదు.

2. సూత్రములు. మీరు వెంబడించడానికి బైబిలుపరమైన సూత్రాలు ఉన్నాయి. మంచి గృహనిర్వాహకత్వపు సూత్రం లూకా 16:1-13లో ఉంది. శిష్యత్వపు వెల లూకా 14వ అధ్యాయం చివరిలో ఉంది. తప్పిపోయిన మనుష్యులను వెదకడమనే సూత్రం లూకా 15వ అధ్యాయంలోని మూడు ఉపమానాలలో ఉంది. వీటినీ, బైబిలులోని ఇతర సూత్రాలనూ వెంబడించండి.

3. ఉదాహరణలు. బైబిలు ఆజ్ఞలు, సూత్రములు నీ జీవితం పట్ల దేవుని సాధారణ చిత్తాన్ని నీకు తెలియజేస్తాయి. మనం వెంబడించడానికి బైబిలులో ఉదాహరణలు ఉన్నాయి. ఉత్తమమైన ఉదాహరణ ప్రభువైన యేసు జీవితం. శిష్యుల పాదాలు కడిగిన తరువాత, ప్రభువైన యేసు ఇలా చెప్పాడు, *“నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని.”* యోహాను 13:15. మనం ఆయన వినయం మాదిరిని వెంబడించాలి. ఫిలిప్పీయులు 2:3-5. మనం ఆయన అడుగుజాడలలో నడవాలి, *“క్రీస్తు కూడ మీకొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచి పోయెను.”* 1 పేతురు 2:21. *“ఆయన యందు నిలిచి యున్నవాడనని చెప్పుకొనువాడు ఆయన ఏలాగు నడుచుకొనెనో ఆలాగే తానును నడుచుకొన బద్ధుడైయున్నాడు. మనమాయన యందున్నామని దీనివలన తెలిసికొనుచున్నాము.”* 1 యోహాను 2:5-6.

**ఒక హెచ్చరిక.** దేవుడు అబద్ధం చెప్పడు, కీర్తనలు 119:160. దేవుడు తన వాక్యానికి అవిధేయత చూపమని నిన్ను నడిపించడు, లేదా చెప్పడు. మనలను సిద్ధపరచడానికి ప్రభువైన యేసు నాయకులను ఇస్తాడు, ఎఫెసీయులు 4:11-14. అయితే, అనేకమంది అబద్ధ బోధకులు ఉన్నారు, 2 తిమోతి 4:3-4. దేవుడు తన వాక్యానికి అవిధేయత చూపమని నీకు చెపుతున్నాడని ఎప్పుడూ విశ్వసించవద్దు. దేవుడు ఆ విధంగా చెయ్యడు. ఒక సంఘు నాయకుడు దేవుని వాక్యానికి అవిధేయత చూపమని నీకు చెప్పినట్లయితే అది ఒక అబద్ధపు బోధ.

**వ్యక్తిగతీకరించబడిన దేవుని చిత్తం.** విశ్వాసుల కోసం దేవుడు వ్యక్తిగతీకరించబడిన చిత్తాన్ని కలిగియున్నాడు. కీర్తనలు 32:8, సామెతలు 3:5-6. దేవుని సాధారణ చిత్తానికి విధేయత చూపుము. అప్పుడు వ్యక్తిగతీకరించబడిన ఆయన చిత్తాన్ని తెలుసుకోవడానికై దానిని మీకు చెప్పమని దేవుణ్ణి పట్టుదలతో ప్రార్థించుము. ఆయన వాక్యం, ఆయన జ్ఞానం, ఆయన మనుష్యులు, ఆయన సమాధానం నుండి ఆయన జవాబును వెదకుము.

**అడగండి**. దావీదు చేసిన ప్రార్థనను ప్రార్థించుము, *“నీవే నా దేవుడవు నీ చిత్తానుసారముగా ప్రవర్తించుటకు నాకు నేర్పుము.”* కీర్తన 143:10. కొలొస్సయిలోని విశ్వాసులు *“ఆయన చిత్తమును పూర్ణముగా గ్రహించినవారునై” యుండవలెనని* అపొస్తలుడైన పౌలు ప్రార్థించాడు కొలొస్సయి 1:9. నీ కోసం, ఇతరుల కొరకు మీరు చేసే హృదయపూర్వక ప్రార్థన, దేవుని చిత్తాన్ని తెలుసుకొని దానిని నెరవేర్చడమే.

**మార్గదర్శకత్వం పొందండి.** దేవుడు తన వాక్యం, తన జ్ఞానం, తన మనుష్యులు, తన సమాధానం ద్వారా వ్యక్తిగతీకరించబడిన తన చిత్తాన్ని బయలుపరుస్తాడు. దేవుడు తన చిత్తాన్ని నీకు బయలుపరచమని ఆయనకు ప్రార్థించు. ఆయన నీ ప్రార్థనలకు వీటి ద్వారా జవాబిస్తాడు:

1. తన వాక్యం. వ్యక్తిగతీకరించబడిన దేవుని చిత్తాన్ని తెలుసుకోవడం క్రమమైన బైబిలు అధ్యయన ఫలితం. ఆయన వాక్యం నుండి నీవు జ్ఞానాన్నీ, అవగాహననూ పొందినప్పుడు నీ పట్ల దేవుని చిత్తం స్పష్టమవుతుంది. ఆయన తన వాక్యానికి విరుద్ధమైన దానిని చెయ్యడానికి ఆయన నిన్ను ఎన్నడూ నడిపించడు.

2. ఆయన జ్ఞానం. దేవుని జ్ఞానం ఆత్మీయ విధేయత నుండి వస్తుంది, 1 కొరింథీయులు 2:14-15. *“మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి.”* రోమా 12:2. ఆయన జ్ఞానం కోసం దేవుణ్ణి అడగండి, *“మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్న యెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును.”*యాకోబు 1:5.

3. ఆయన మనుష్యులు. దేవుని చిత్తాన్ని అర్థం చేసుకోవడానికి దేవుని మనుష్యులు ఒక వనరుగా ఉన్నారు. మాట్లాడడం ద్వారా గానీ లేదా వ్రాయడం ద్వారా గానీ ఆయన వాక్యాన్ని సరిగ్గా బోధించేవారు సహాయం చేయగలరు, కొలొస్సయులు 1:28. పరిణతి చెందిన విశ్వాసుల నుండి హెచ్చరిక తీసుకోవడం మంచిది. ఒకరి కంటే ఎక్కువ మంది ఆలోచనకర్తలు ఉండడం మంచి ఆలోచన, *“ఆలోచన చెప్పువారు లేని చోట ఉద్దేశములు వ్యర్థమగును ఆలోచన చెప్పువారు బహుమంది యున్న యెడల ఉద్దేశములు దృఢపడును.”* సామెతలు 15:22. పరిణతి చెందిన విశ్వాసులు లోపరహితులు కాదు, అయితే దేవుని చిత్తాన్ని నిర్ధారించుకోవడంలో నీకు సహాయపడడానికి వారు అర్థవంతమైన అంతర్దృష్టిని ఇవ్వగలరు.

4. ఆయన సమాధానం. దేవుని సమాధానం వ్యక్తిగతీకరించబడిన ఆయన చిత్తం అంతిమ నిర్ధారణ, *“క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండ నియ్యుడి.”*కొలొస్సయులు 3:15. *“అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండును.”* ఫిలిప్పీయులు 4:7. ప్రార్థన, బైబిలు అధ్యయనం, ఆత్మీయ జ్ఞానం, ఆత్మీయంగా పరిణతి చెందిన ఆలోచనకర్తల నుండి పొందిన అంతర్దృష్టుల తరువాత ఒక నిర్ణయం సరైనదే అని దేవుడిచ్చిన ప్రగాఢమైన భావనయే ఈ సమాధానం. ఆయన సమాధానమును వెదకండి, దానికోసం ఎదురుచూడండి.

**నడుచుకొనండి.** ఏదైనా విషయం ఆయన చిత్తమా అని మీరు అడిగినట్లయితే పౌలు విషయంలో జరిగిన విధంగా జవాబు “కాదు” అని రావచ్చు, 2 కొరింథీయులు 12:7-10. అది “వేచి ఉండండి” అని రావచ్చు. “వేచి ఉండండి” అనే ఆయన జవాబు గొప్ప ఆశీర్వాదానికి దారితీయవచ్చు, యెషయా 40:31. దేవుని జవాబు “అవును” అని వచ్చినప్పుడు, అది కష్టమైనా, జనాదరణ లేనిదైనా, లేదా విలువైనదైనా ఆయన చిత్తాన్ని నెరవేర్చండి. మన హృదయాల నుండి ఆయన చిత్తాన్ని నెరవేర్చడంలో మనం ఆనందించాలి, కీర్తనలు 40:8, ఎఫెసీయులకు 6:5-6. క్రైస్తవ్యం పేరిట బోధించబడే నకిలీ జవాబుల పట్ల జాగ్రత్తగా ఉండండి. దేవుని చిత్తం మీకు తెలుసని మీరు నిశ్చయించుకున్నప్పుడు విధేయత చూపండి.

---

*దేవుని చిత్తమును నేను ఏవిధంగా తెలుసుకొంటాను?* © 2026 జాన్ డి మోరిస్ III రచించినది యాక్ట్స్ ఒన్ ఎయిట్ చేత ప్రచురణ. పూర్తి ప్రకటనతో సహా, దానిలోని విషయాన్ని మార్చకుండా మీరు దీనిని స్వేచ్ఛగా ముద్రించుకోవచ్చు, నకలు తీసుకోవచ్చు, పంపించవచ్చు, ఈమెయిల్ చేసుకోవచ్చు లేదా సందేశంగా పంపించవచ్చు. మీ పరిచర్య లేదా సంఘం పేరు లేదా లోగోను మొదటి పేజీ పైభాగంలో మీరు చేర్చవచ్చు. మీ సంప్రదింపు సమాచారాన్ని రెండవ పేజీ దిగువన ఉన్న గీతకు పైన చేర్చవచ్చు. WillofGod316.org కేవలం బైబిలు ఆధారితమైనది. విశ్వాసులు దేవుని చిత్తాన్ని కనుగొనడంలో సహాయపడడానికి ఇది ఉనికి కలిగి ఉంది. మీరు యాక్ట్స్ వన్ ఎయిట్ (వీలైతే ఆంగ్లంలో)కు ఈ కింది చిరునామాకు ఇమెయిల్ చేయవచ్చు: Hello@Mail316.org. అనువాద సేవలను www.ChristianLingua.com అందించింది. *నేను దేవుని చిత్తాన్ని ఎలా తెలుసుకోగలను?* నలభై ఎనిమిది భాషలలో www.WillofGod316.orgలో. ఉచితంగా అందుబాటులో ఉంది. తెలుగు అనువాదంలోని ఉల్లేఖనాలు ది బైబిలు సొసైటీ ఆఫ్ ఇండియా, పరిశుద్ధ గ్రంథం 2023 Ministry Edition నుండి తీసుకోబడ్డాయి. ఈ అనువాదంలోని బైబిల్ ఉల్లేఖనాలు వీటి నుండి తీసుకోబడ్డాయి: ది బైబిలు సొసైటీ ఆఫ్ ఇండియా, పరిశుద్ధ గ్రంథం.